ప్రజాశక్తి
గురువారం 20 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

రైతుల సంక్షేమమే లక్ష్యం

- డ్రోన్లను సబ్సిడీతో ఇస్తాం..
- మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-మర్రిపూడి

రైతుల ఆదాయం రెట్టింపు, వారి సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం రెండో విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం మర్రిపూడి మండల కేంద్రంలో నియోజకవర్గ పరిధిలోని 36,808 మంది రైతులకు సంబంధించిన 24.72 కోట్ల రూపాయల మెగా చెక్కును మంత్రి స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సాగు భూమి కలిగి ఉన్న భూ యజమాని రైతు కుటుంబాలకు, అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పిఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు.. వెరసి సంవత్సరానికి 20 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ రైతులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ఆగష్టు 2న ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో మొదటి విడత కింద కేంద్ర, రాష్ట్ర నిధులు కలిపి రాష్ట్రంలోని మొత్తం 46,85,838 రైతుల ఖాతాల్లో రూ.3174.43 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రెండో విడత కింద 3135.01 కోట్ల రూపాయలు ▶ 2లో

ఏ పంట వేయాలి.?

- పంటలకు గిట్టుబాటు ధర కరువు
- సందిగ్ధంలో రైతులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా రైతులు ఇప్పుడు పెద్ద సందిగ్ధంలో పడ్డారు. మొన్న మొంథా తుఫానుకు 12,600 హెక్టార్లలో అన్ని రకాల పంటలు పోయాయి. మిగిలిన అరకొర పైర్లు ఉంటాయా?లేదా?అన్నదీ స్పష్టత లేదు. పొలాలు ఎలా ఉన్నాయో కేంద్రబృందం కూడా పరిశీలించింది. వాస్తవం చెప్పాలంటే వ్యవసాయం ఈ ఏడాది పూర్తిగా చేజారింది. ఖరీఫ్‌లో కరువు వల్ల సాగు జరగలేదు. ఇప్పుడు వేసిన కొద్దిపాటి పంటలూ వర్షానికి హాజరయ్యాయి. ఇక రబీలో ఏ పంట వేయడానికి సమయం ఉంది. ఏ పంట వేస్తే చేతికి వస్తుందనేదీ అంతుచిక్కడం లేదు. వర్షాలకు ఇప్పటి వరకూ మళ్లీ పొలాల్లో ఏ పంట వేయాలో తెలియక చాలాచోట్ల వదిలేశారు. కొన్నిచోట్ల పొగనాట్లు వేస్తున్నారు.

పంటలు దెబ్బతిన్న పొలాల్లో కొత్తగా ఏ పంటవేయాలో తెలియడం లేదు. ఏ పంట వేసినా గిట్టుబాటు ధర లేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వాణిజ్య పంటల విషయానికి వస్తే పొగాకు సాగుపై పూర్తిగా గందరగోళం నెలకొంది. ఎందుకంటే గతేడాది పండించిన పొగాకు వేలం ఇప్పటికీ ముగియలేదు. ఇంకా వేలం నడుస్తూనే ఉంది.పైగా ధరలు ఉన్నాయా? అంటే దోపిడీ కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం ఉన్న సగటు ధర కూడా ఇపుడు లేదు. కిలో సగటు ధర రూ.222 మించిలేదు. వేలం ఇంకెంతకాలం నడుస్తుందో తెలియడం లేదు. ఫిబ్రవరిలో మొదలైంది. మళ్లీ సీజన్ వచ్చేసింది. వర్షాలకు పొగాకు వేసిన నాట్లు పోయాయి. ఇపుడు మళ్లీ సాగుచేయాలా? లేదా? అనేది అంతుచిక్కడం లేదు. అయితే వారం రోజులపాటు వేలంలో పొగాకు భారీగా ధరలు పెంచారు. దీంతో పొగాకు నాట్లు మొదలుపెట్టారు. రైతులు వేగం పెంచారు. ఫలితంగా ఎవరి వ్యాపారం వాళ్లు చేశారు. నారుమూట రూ.2 వేల నుంచీ రూ.7 వేలకు పెరిగింది. మళ్లీ ధరలు తగ్గించారు. పొగాకు నాట్లుపైనా ఉత్సాహం లేదు.పొగాకు బ్యారన్‌కు లక్ష నుంచీ రెండు లక్షల రూపాయలు వరకూ ప్రాంతాలను బట్టి నష్టం తప్పదంటున్నారు. పొగాకు రైతులు కోలుకునే పరిస్థితి లేదు. జిల్లాలో లక్షన్నర ఎకరాల్లో పొగాకు సాగు ఉంది. ఒకవైపు పొగాకు ఉత్పత్తుల ధరలు పెంచుతున్నారు.జీఎస్టీలు పెంచారు. ముడిసరుకు అందించే రైతులకు మాత్రం ధరలు ఎందుకు తగ్గిస్తున్నారన్నదే ప్రశ్నగా మారింది. ఈ ఏడాది ప్రజాప్రతినిధులు కూడా పొగాకు మార్కెట్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. మంత్రులు మొదట్లో వేలం కేంద్రాలను సందర్శించారు. తర్వాత వదిలేశారు. మాజీ సిఎం జగన్ పొదిలిరాగా అక్కడ జరిగిన సంఘటనల ఆధారంగా పోలీసుల కేసులతో వాళ్లూ వెనక్కు తగ్గారు. వామపక్షాలు, రైతు సంఘాల నేతలు వేలం కేంద్రాలను సందర్శించి ధరల కోసం ప్రయత్నాలు చేశారు. ఇపుడు పొగాకు సాగుపై రైతుల్లో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితే ▶ 2లో

రూ.కోట్లు ఖర్చయినా..చిల్లచెట్లలోనే..

- జగనన్న కాలనీలలో దారుణ పరిస్థితి
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు

చిల్లచెట్ల మధ్య అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో జగనన్న కాలనీల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. లెవలింగ్ పేరుతో ఉన్నదంతా ఖర్చయి పోయింది. ఆ కాలనీ ప్రస్తుతం చిల్లచెట్లతో నిండిపోయి ఉంది. గృహ నిర్మాణ శాఖ అధికారులు వారానికి ఒక సమావేశం వేసి ఆ కాలనీలను పరిశీలించడం తప్ప ఆ కాలనీలో చిల్లచెట్లు తొలగించి లబ్ధిదారులకు న్యాయం చేద్దామన్న ఆలోచన కరువైంది. శింగరాయకొండ మండలంలో ఒక్క పకీరు పాలెం, నర్రవారి పాలెం లేఅవుట్ తప్ప మరి ఎక్కడ పూర్తిస్థాయిలో నిర్మాణాలు ముందుకు సాగలేదు.

కనుమళ్ల గ్రామపంచాయతీలో ఉన్న లేఔట్ పరిస్థితి అయితే దారుణంగానే ఉంది. ఆ గ్రామపంచాయతీలో కనుముల్ల చెరువులో లేఔట్ వేయడం ద్వారా రావాలన్నా, పోవాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టించారు. అక్కడ ఇంటికి పోవాలన్నా దారి లేదు. డొంకా లేని పరిస్థితిగా మారింది. వర్షం వస్తే చెరువులో నీరు నిండి ఆ కాలనీ వైపు ఇంటిలోకి పోయే విధంగా అక్కడ నిర్మాణాలు చేపట్టి ఉన్నారు. శానంపూడి గ్రామపంచాయతీలో నిర్మాణాల విషయంలో జాప్యం చోటు చేసుకుంటూనే ఉంది. కలికివాయి గ్రామపంచాయతీలో అయితే దారుణంగానే ఉంది. ఊరికి పడమర వైపున నందనవనం వెళ్లే దారిలో పొలాలు కొనుగోలు చేసి అక్కడ మట్టి అక్కడే పోసి అప్పటి నాయకులు కోట్ల రూపాయలు దోచేసు కున్నారు. ఆ కాలనీ పరిస్థితి ప్రస్తుతం కాలనీ మొత్తం చిల్లచెట్లతో నిండిపోయి.. లోపలికి పోవాలన్న దారి లేని పరిస్థితిగా తయారైంది. అప్పట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని అప్పట్లో తెలుగుదేశం నాయకులు ఆరోపించినప్పటికీ నేడు పరిస్థితి మాత్రం అంతా ఒకటిగానే మారిపోయారు. ప్రస్తుతం కాలనీలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, చిల్ల చెట్లతో నిండి పోవడంతో లోపలికి పోవాలన్న ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఒక్కటంటే ఒక్క నిర్మాణం కూడా అక్కడ జరగకపోవడం.. జరిగిన ఒక్క నిర్మాణం కూడా ముందుకు కదలకపోవటం బేస్‌మట్టాల్లోనే నిలిచిపోవడం కనిపిస్తుంది. ఊళ్లపాలెం రోడ్డులో శింగరాయకొండకు చెందిన వారికి రోడ్డుకి రెండు వైపులా కాలనీని సిద్ధం చేశారు. అక్కడ దాదాపు రెండు కోట్లకు పైగా ఖర్చు పెట్టి మట్టి తోలారు. మట్టితోలిన అప్పటి వైసిపి నాయకులు జేబులో ఫుల్లుగానే నింపుకున్నారు. ఆ తరువాత ట్రాన్స్‌కో అధికారులు కరెంటు స్తంభాలు వేసి వైర్లను కూడా వేయడం జరిగింది. అయితే ప్రస్తుతం. కరెంటు స్తంభాలే మిగిలాయి తప్ప వైర్లు కూడా కనిపించిన పరిస్థితి అక్కడ ఉంది. ఆ కరెంటు వైర్లు దొంగలు ఎత్తుకొని పోయారా అధికారులు వైర్లు తీసుకొని వెళ్లి మరోచోట వేశారా అనేది ఎవరికి తెలియని ప్రశ్న. అక్కడ రెండు పక్కల రోడ్డుకి కాలనీలో నిర్మాణం చేసి పెట్టిన రెండు ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తి అవటం జరిగింది ఆ రెండు ఇళ్లల్లో కూడా ఒక్కటి కూడా నివాస యోగ్యంగా లేదు. గృహ నిర్మాణ శాఖ అధికారులు అవగాహన కల్పించకుండా ఉండటం వల్ల ఆ కాలనీలో పరిస్థితి అలా అయిందని లబ్ధిదారులు చెప్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఆ నిధులు మొత్తం మట్టి పేరుతో దోచుకొని ప్రస్తుతం చిల్ల చెట్లతో ఆ కాలనీలు నిండిపోయి ఉన్నాయి.


రైతులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం..

- జిల్లాలో 1,60,441 రైతులకు రూ.107 కోట్ల సాయం..
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతుల ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య ఉద్దేశమని జిల్లా ఇన్‌ఛార్జి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రైతులకు రెండో విడత ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తో కలసి జిల్లా ఇంచార్జి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతుల తలసరి ఆదాయం పెంచాలన్నది కూటమి ప్రభుత్వ లక్యమని చెప్పారు. రైతులు ఎరువుల వాడకం తగ్గించి ప్రకతి వ్యవసాయం వైపు మళ్లి.. ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. 90 శాతం రాయితీతో బిందు సేద్య పరికరాలను రైతులు అందించడం జరుగుతుందన్నారు. రాయితీ పై విత్తనాలు, ఎరువులు, యాంత్రికరణ పరికరాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. రైతులు వ్యవసాయ పొలాల్లో సోలార్ ఏర్పాటు ▶ 2లో

రైతుల సంక్షేమమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6309 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 2.68 లక్షల మంది రైతులకు రూ.180.36 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కొండపి నియోజకవర్గ పరిధిలో 36808 మంది రైతుల ఖాతాల్లో 24.72 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మర్రిపూడి మండల పరిధిలో 7920 మంది రైతులకు రూ. 5.30 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ మండలానికి రెండు డ్రోన్స్ వంతున సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నామన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ... రైతులకు అన్ని విధాలా అండగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. మన జిల్లాలో ప్రధానంగా కాలువలు, చెరువులు, వర్షం ఆధారిత వ్యవసాయం జరుగుతున్నట్లు తెలిపారు. సేద్యంలో టెక్నాలజీని వినియోగించుకోవాలని రైతులకు ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమాసియా దేశాలు టెక్నాలజీని ఆధారంగా చేసుకుని వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ మార్కెట్లో మంచి ధర ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఈ దిశగా టెక్నాలజీని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూముల రకాన్ని బట్టి మారిన పరిస్థితులకు అనుగుణంగా రసాయనాల వినియోగం ఉండాలి తప్ప ఒకే ధోరణి సరికాదన్నారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో 33 కంపెనీలు ప్రత్యేకంగా వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేలా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలను కూడా తెలుసుకునేలా వారం రోజుల పాటు ' అన్నదాత - సుఖీభవ ' కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఫ్లోరైడ్ నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును కూడా త్వరగా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భూములు విస్తారంగా ఉండటం వల్ల పరిశ్రమలు స్థాపించేందుకు పలు కంపెనీలు కూడా వస్తున్నాయన్నారు. మర్రిపూడి మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని సత్వరమే పరిష్కరించేలా ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టరుకు చెప్పానని కలెక్టర్ తెలిపారు. ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. ఈ 18 నెలల కాలంలో కొండపి నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. మర్రిపూడి, టంగుటూరు రోడ్లు మరమ్మతులపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రితో మాట్లాడటం జరిగిందని, త్వరలో ఈ రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కొండపి నియోజకవర్గం, ముఖ్యంగా ఈ మర్రిపూడి మండలం చాలా వెనుకబడిన ప్రాంతాలు, ఈ ప్రాంతంలో చిన్న కారు, సన్న కారు రైతులకు సంబంధించి రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు... నియోజక వర్గం అభివృద్ధి కి కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల విశాఖపట్నంలో ముఖ్యమంత్రి గారి సారథ్యంలో 16 లక్షల కోట్ల రూపాయల మేర వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. మన ప్రాంతానికి కూడా సీబీజడ్ ప్లాంట్ రాబోతున్నట్లు తెలిపారు. మారిటైమ్ బోర్డు కు సంబంధించి 1 లక్షా 67 వేల కోట్ల రూపాయలతో 23 కంపెనీలతో విశాఖపట్టణం సమ్మిట్లో ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. సుమారు ఒక లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నట్లు తెలిపారు. తద్వారా ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, కొండపి నియోజకవర్గ ప్రత్యేక అధికారి కళావతి, నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరస దొంగతనాలతో ప్రజల బెంబేలు ..

ప్రజాశక్తి-మార్కాపురం : వరస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల పరిధిలోని గజ్జలకొండ పంచాయతీలోని పలు గ్రామాల్లో రెండు నెలలుగా దొంగతనాలు జరుగుతున్నాయి. గొర్రెలు, మేకలు, పందులు, డ్రిప్ వైర్లు, ట్రాక్టర్ ట్రక్కులు సైతం మాయం అవుతున్నాయి. కొందరు ఓ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరితో ఈ పనులు సాధ్యమయ్యేవి కాదని ప్రజలు అంటున్నారు. దొంగతనాలకు వచ్చే వారు ఎంతటికైనా తెగిస్తారనే భయంతో ప్రజలు వారిని పట్టుకొనేందుకు సాహసం చేయలేకపోతున్నారు. ఇటీవల ఆవుల వెంకటేశ్వర్లుకు చెందిన 12 పందులను అప హరించారు. బత్తుల గంగరాజుకు చెందిన ఓ పొట్టేలు మాయమైంది. మెట్టెల పుల్లయ్యకు చెందిన మూడు మోటార్లు ఎత్తుకెళ్లారు. అలమూరి చిన్న కాశయ్యకు చెందిన 2 గొర్రెలు, శ్రీరాం నాగయ్యకు చెందిన 8 గొర్రెలను అపహరించారు. శనిగ గాలిరెడ్డికి చెందిన విద్యుత్ మోటారు ఎత్తుకెళ్లారు. తమ్మినేటి ఓబులరెడ్డికి చెందిన ట్రాక్టర్ ట్రక్కును మాయం చేశారు. జడ్పిటిసి నారు బాపనరెడ్డికి చెందిన డ్రిప్ ఎత్తుకెళ్లారు. గజ్జలకొండ, మాలపాటిపల్లె, తూర్పుపల్లి, పడమటిపల్లి తదితర గ్రామాల్లో ఈ చోరీలు జరిగాయి. దొంగల అపహరణతో బాధితులు లక్షల్లో నష్టపోయారు. పోలీసులు రాత్రివేళ గట్టి నిఘాఏర్పాటుచేసి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ పంట వేయాలి ,?

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. రెండో అతిపెద్ద వాణిజ్య పంట శనగ. ఇపుడు దీనికి ధరలేదు. గతఏడాది పండించిన పంట కోల్డ్‌స్టోరేజీల్లో ఉంది.10 నుంచీ 12లక్షల క్వింటాళ్ల పంట ఇంకా నిల్వలోనే ఉంది. ఎందుకంటే ధర రూ.5వేలకు పడిపోయింది.పదేళ్ల క్రితమే 9వేలు అమ్మింది.దీని అవసరం ఉన్నా ధరలు మాత్రం పెంచడం లేదు జిల్లా అంతటా శనగ భూములకు అనుకూలించింది.దీనిపై ఆసక్తి పెరిగింది.ధరలేక ఇపుడు ఏంచేయాలో తెలియడం లేదు. గతేడాది నిల్వలే పోకుంటే ఇపుడు పండించి ఎక్కడ పెట్టాలన్నదే రైతుల్లో ఆందోళనగా మారింది. శనగ కూడా లక్ష ఎకరాల్లో సాగు ఉంది.మిర్చి రైతులూ మొన్న తుఫానుకు మునిగారు. పశ్చిమప్రాంతంలో వేసిన మిర్చి అంతా దెబ్బతిన్నది. ఇపుడు ధరదే పెద్ద సమస్య.క్వింటా ఒకప్పుడు రూ.20వేలు దాటిన చరిత్ర ఉంది.ఇపుడు రూ.10వేల నుంచీ రూ.11వేలు మించడంలేదు. మిర్చిని రైతులు ఇష్టంగా పండిస్తారు.పురుగుమందులు ఎక్కువ వినియోగించి ఎకరాకు కనీసం 20 క్వింటాళ్లకు తగ్గకుండా పండిస్తారు. దోర్నాల,మార్కాపురం, వైపాలెం త్రిపురాంతకం, ప్రాంతాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. అంతా దెబ్బతిన్నది. కాయలు రాలిపోయాయి. తోటలు ఉరకేశాయి. ఇపుడు వాటిస్థానంలో ఏ పంటలు వేయాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న, సోయాబీన్ తదితర ఉత్పత్తులను దిగుమతులకు అనుమ తించారు. వాటి ధరలూ పడిపోయాయి. కోళ్ల పెంపకం వల్ల జిల్లాలో దాణా కోసం మొక్కజొన్న సాగు పెరిగింది. వర్షాలకు కండెల దశతో ఉన్న పంట దెబ్బతిన్నది. దీని ధరలూ పడిపోయాయి. క్వింటారూ.2400 మద్దతు ధర ఉండగా ఇపుడు రూ.1700కు పడిపోయింది. వ్యవసాయం తీవ్ర గందరగోళంలో ఉన్నా ప్రజాప్రతినిధులకు మాత్రం పట్టడం లేదు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటే రైతులకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో కంటే ఎక్కువగానే రైతులకు యూరియాను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఏ రాష్ట్రంలో లేనటువంటి విధంగా వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులు బ్యాంక్ ఖాతాలకు డబ్బులు జమ చేయడం జరిగిందని తెలిపారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభోత్సవం చేయడం జరుగు తుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా జిల్లాకు సంబంధించి 1,60,441 మంది రైతులకు రూ.107 కోట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రైతులకు మంచి చేయాలన్నదే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. . అనంతరం జిల్లాకు సంబంధించి 1,60,441 మందికి సంబంధించి రూ.107 కోట్ల చెక్కును మంత్రి,ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జయ ప్రకాష్, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి అన్నపూర్ణ,, డి యం అండ్ హెచ్ ఓ.డాక్టర్ విజయమ్మ, ఆర్డీఓ పి.గ్లోరియా, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : తహశీల్దారు

ప్రజాశక్తి-దొనకొండ : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దారు రమాదేవి తెలిపారు. దొనకొండ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఆర్అండ్‌బికి చెందిన విలువైన స్థలం ఆక్రమించి కంచె వేసినట్లు అందిన సమాచారం మేరకు తహశీల్దారు ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఆర్అండ్ స్థలాన్ని ఎవరూ ఆక్రమించిన కంచె వేశారని అక్కడి దుకాణదారులు అడగగా, ఎవరో రాత్రికి రాత్రి వేశారని తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఆర్అండ్‌బి స్థల ఆక్రమణ గురించి ఆ శాఖ ఇఇ సమాచారం అందించినట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం అందుబాటులో లేరని, రెండు రోజుల్లో వచ్చి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపినట్లు తహశీల్దారు పేర్కొన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA

Arbitration Claim Petition No. 85/2025

Between:-

Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant

And

Tella Papaiah Shastri & Others
....Opponents

Notice to Opponent No. 5

Noone Nagavardhini, D/o. Sreeramulu, R/o. H. No. 3-92, I Ltd Colony, Kothapeta, Chirala Mandal, Bapatla District.
(Opponent No. 5)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 28-11-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on **28-11-2025** at **11-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)

Hearing Date: 28-11-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada

IN THE HONOURABLE COURT OF THE 2ND ADDITIONAL DISTRICT JUDGE CUM MACT AT SRIKAKULAM
M.V.O.P. 29/2021

Between:-

Thota Mallamma and another
----Petitioners

And:-

Kareti Venkata Madhusudhana Rao and others
.....Respondents

To,

M/s Shriram General Insurance Company Limited, represented by its Branch Manager, Kndukuru Branch, Prakasam District.

పై నంబర్ గల పిటిషన్ లో మీరు 3వ రెస్పాండెంట్ అయి ఉన్నారు, పై కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తము తేదీ **26-11-2025 వాయిదా అయి ఉన్నది.** సదరు పైన తెలిపిన **తేదీన ఉదయం 10:30 నిమిషములకు** కోర్టు వారి ఎదుట స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను, అట్లు లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

DUMPALA RAMANA RAO
ADVOCATE, SRIKAKULAM,
CELL 9949291368.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్, అమలనాదునివారి పాలెం, డోర్ నెం. 18-1-85 రులో నివాసం, కొచెర్ల వెంకటేశ్వర్లు గారి కుమారుడు కొచెర్ల కళ్యాణ్, వయస్సు 27 సం.లు, (ఆధార్ నెం. 9711 8571 0628) అను వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా :-

మా క్లయింట్ యొక్క స్థిరాస్తి అనగా లోగా తేది.19-07-2024న ప్రకాశంజిల్లా, మద్దిపాడు మండలం, అన్నంగి శివారు, బూరేపల్లి కాలనీ గ్రామ వాస్తవ్యురాలు స్వర్ణ సుమతి గారి వద్ద నుండి స్థిరాస్తిని కొనుగోలు చేసి, మాక్లయింటు పేరిటకి స్థిరాస్థి స్వాధీన పరచిన విక్రయ దస్తావేజు పొంది అద్దంకి స.రి.వారి కార్యాలయములో దస్తావేజు నెం. 7970/2024రుగా నమోదు కాబడియున్న ప్రకాశంజిల్లా, మద్దిపాడు మండలం, గుండ్లపల్లి గ్రామ సర్వే నెం.224రులో గల ఆస్థికి సంబంధించిన ఓరిజినల్ దస్తావేజు యొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజు తేది.11-09-2017న అద్దంకి స.రి.వారి కార్యాలయములో నమోదు కాబడిన దస్తావేజు నెం.3780/2017ను. నేను తేది. 10-11-2025న మా అత్త గారు (స్వర్ణ సుమతి భర్త శ్రీను) గ్రామమైన బూరేపల్లి గ్రామము నుండి మద్దిపాడు తహశీల్దార్ కార్యాలయమునకు బైక్ మీద పోవు మార్గమధ్యములో నాయొక్క డాక్యుమెంటు కవర్ జారీ పోయినది. పై ఓరిజినల్ రిజిస్టర్డ్ లింకు సెటిల్ మెంట్ దస్తావేజు నెం.3780/2017రును ఎవరికైనను దొరికిన యెడల క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

షెడ్యూలు

ప్రకాశంజిల్లా, మార్కాపురం జిల్లా రిజిస్ట్రేషన్ యిలాకా, అద్దంకి సబ్ రిజిష్టరులో చేరిన మద్దిపాడు మండలం, గుండ్లాపల్లి గ్రామపంచాయితీ ఏరియాలోని గుండ్లాపల్లి గ్రామ సర్వే నెం.224, సరియగు డోర్‌నెం:5-16రుకు సమీపములోని స్థలంకు హద్దులు:-

తూర్పు : కురిచేటి మల్లేశ్వరి గారి స్థలం
దక్షిణం : కురిచేటి స్వరాజ్యం గారి స్థలం
పడమర : బజారు
ఉత్తరం : కురిచేటి విమల గారి స్థలం

యీ హద్దులలోని ఖాళీ స్థలం 0.05 సెంట్లు లేక 242 చ.గ.లు లేక 202.31చ.మీటర్లుస్థలం మాత్రమే

స్థలం: ఒంగోలు,
తేది :19-11-2025

ఇట్లు
సామంతపూడి శ్రీనివాసరావు,
పాదర్తి ఆదిశేషు
ఏల్చూరి రాజశేఖర్
న్యాయవాదులు, జిల్లాకోర్టు ఎదురు, ఒంగోలు.
సెల్ నెంబర్ **9440266265**

బ్యాంక్ ఆఫ్ బరోడా

బాపట్ల బ్రాంచి, 12-4-11, చదల వీధి, (ఆంజనేయ స్వామి గుడి వీధి), బాపట్ల, బాపట్ల జిల్లా, ఏపి-522101

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం

ఋణగ్రహీత: శ్రీ మట్లపూడి విష్ణు కుమార్, తండ్రి: శ్రీ కోటయ్య, డోర్ నెం: 15-96, హరిజనవాడ, నిజాంపట్నం-522314, బాపట్ల జిల్లా. **సహ-ఋణగ్రహీత: 2. శ్రీమతి మట్లపూడి నాగమణి,** భర్త: శ్రీ మట్లపూడి కోటయ్య, డోర్ నెం: 15-96, హరిజనవాడ, నిజాంపట్నం-522314, బాపట్ల జిల్లా. **హామీదారు: శ్రీ మట్లపూడి కోటయ్య,** తండ్రి: శ్రీ వీరయ్య, డోర్ నెం: 15-96, హరిజనవాడ, నిజాంపట్నం-522314, బాపట్ల జిల్లా.

విషయము: బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి వారు మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం - టర్మ్‌లోన్ - 52310600001438 కి చెందిన అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా **తేదీ. 01-11-2025** న మీకు తిరుగు రసీదుతో కూడిన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. కానీ సదరు నోటీసు బట్వాడ కానందున తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరిగి వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది, మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది. 28-10-2025** నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఎ) పరిగణింపబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు **ది. 30.10.2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 35,09,414.25** (అక్షరాలా ముప్పై ఐదు లక్షల తొమ్మిది వేల నాలుగు వందల పద్నాలుగు రూపాయల ఇరవై ఐదు పైసలు మాత్రమే) మరియు **ది. 31-10-2025** నుండి వర్తించని వడ్డీ మరియు ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) నియమాను సారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం జారీ చేయబడినది.

ఆస్తి వివరములు:

సెక్యూరిటీ అగ్రిమెంట్ వివరాలు మరియు తనఖా పెట్టిన ఆస్తి వివరాలు మొత్తం ఏరియాతో కలిపి మరియు హద్దులు క్రింది విధంగా:

గుంటూరు జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా), మంతెనవారిపాలెం సబ్ జిల్లా, నిజాంపట్నం గ్రామం, నిజాంపట్నం గ్రామ పంచాయతీ, నిజాంపట్నం మండలం, సర్వే నెం: 476/1ఎ, డోర్ నెం: 15/96 సమీపంలో గల ఎకరా 0.10 సెంట్లు లేదా 484 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు దానిపై ఉన్న ఆర్.సి.సి రూఫ్ (జి+2) నివాస భవనం యొక్క **హద్దులు: తూర్పు:** పట్టాభి సామెల, యేమినేని సాంబయ్య గార్ల స్థలం, **దక్షిణం:** అమర్తలూరు అంకం గారు మరియు ఇతరుల స్థలం, **పడమర:** పల్లె బాబా వలి యొక్క మిగిలిన స్థలం, **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు. పైన పేర్కొన్న స్థలంపై ఇప్పుడు మరియు భవిష్యత్తులో నిర్మించబడే అన్ని భవనాలు, నిర్మాణాలు మరియు సదుపాయాలతో సహా. (మరింత వివరంగా డాక్యుమెంట్ నెం: 893/2002, తేదీ 17.08.2002 క్రింద వివరించబడింది.)

తేది: 01-11-2025
ప్రదేశము: బాపట్ల

అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నర్శింహరావు తెలిపారు. ఈనెల 18వ తేదీన మైనంపాడు గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో పీవీఎల్ నారాయణ, నీరుకట్టు మధుశాలినీ, ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా పల్లె పండు, అండర్-14 విభాగంలో ఏసుపోగు దీక్ష, పి.విల్సన్‌లు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎంఈవో షేక్ అమీర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూ ఆడుకోవాలన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు తల్లితండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దొనకొండ విద్యార్థులు

టంగుటూరు: తూర్పునాయుడుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎన్‌వి సుధారాణి తెలిపారు. నవంబరు 18వ తేదీ మైనంపాడులో నిర్వహించిన సాఫ్ట్ బాల్ సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ కనపరచారు. 17 ఏళ్ల విభాగంలో బాపట్ల వర్షిత్, ఎం.త్రివేణి, 14 ఏళ్ల విభాగంలో కామణి లక్ష్మీ ప్రసన్న, డి.స్నేహిత, ఎం.శ్యామ్ కుమార్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు పశ్చిమ గోదావరి వీరవాసరంలో జరిగే పోటీల్ల పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం సుధారాణి, పిడి ఎమ్.రాజ్యలక్ష్మి, మాధురి, నిర్మలా దేవి, యస్‌కె. నాసర్‌వలి, పి.సురేష్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సత్తా చాటిన తూర్పునాయుడు పాలెం విద్యార్థులు

మర్లపాడులో ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మర్లపాడు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం చుండూరి చలపతిరావు తెలిపారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మైనంపాడు గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో యం.మోహన తేజ, జి.ప్రణీత్, ఎ.క్రాంతికుమార్, డి.యామిని ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22 నుంచి 24 వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అండర్ -17 విభాగంలో ఎ.అరుణ్ కుమార్, కె.యాదగిరి లక్ష్మీ నరశింహ, జి.కీర్తన, కె.హేమలత ఎంపిక అయ్యారని వీరు డిసెంబర్ 2 నుంచి 4వరకు వెస్టు గోదావరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. విజేతలను పిడి కౌసల్య, ఉపాధ్యాయులు అభినందించారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

డ్వామా పిడి గంగవరపు జోసెఫ్ కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రజలందరూ కలిసికట్టుగా భూగర్భజలాలను పెంపొందించాలని డ్వామా పిడి గంగవరపు జోసెఫ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడులో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జోసెఫ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో భాగంగా నీటిని సంరక్షించే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాంటి పనులను గ్రామంలో ఎక్కువగా గుర్తించాలన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పొలంలో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను తీసుకోవాలన్నారు. చెరువుల పూడికతీత, పూడికతీత పనులు చేయడం వలన నీళ్ల భూమిలో ఇంకి సమృద్ధిగా భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉందన్నారు. నీటి సంరక్షణకు గ్రామస్తులందరూ పాటుపడాలన్నారు. అదేవిధంగా రైతులు పండ్ల తోటల వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం అనేక రాయితీలను కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతి కుటుంబం 100 రోజుల పనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న వనరులను గుర్తించే విధంగా రంగవల్లులతో సోషల్ మ్యాప్‌ను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడి బసవ సుబ్బారావు, సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ ముల్లూరు మురళి, ఏపీవో ఆర్.ధనుంజయ్ వర్మ, పంచాయతీ కార్యదర్శి నాదెండ్ల రాధా, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్ హనుమాన్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న పిడి జోసఫ్ కుమార్

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కనిగిరి నుంచి హనుమంతుని పాడు మండల కేంద్రం వరకు నిర్మాణం చేపట్టిన ఆర్‌అండ్‌బి ఓవి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా ఈ పనులు జరుగుతున్నాయని, ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా పనులు ఆగిపోయాయన్నారు. గతంలో ఉన్న రోడ్డు తొలగించి దానిపై కంకర వేయడంతో వర్షానికి రోడ్డు మీద ఉన్న మట్టి మొత్తం కొట్టుకుపోయి కంకర బయట పడిందన్నారు. ఈ రాళ్లలో ప్రయాణం నరకయాతనంగా ఉందని వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు నిర్మించకుండా లావుపాటి కంకర పోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధానంగా రహదారి పూర్తిగా ధ్వంసమైన అర్బన్ కాలనీ, శ్రీరంగాపురం ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. పనుల్ల జాప్యంతో టూవీలర్లు, ఆటోలు, వాహనాలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి రోలింగ్ ద్వారా రోడ్డును చదును చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయటంతో పాటు వెంటనే తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ నిర్మాణానికి స్థలం సేకరించాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్లలో ఎస్సి, బీసీ సంక్షేమ హాస్టల్లో పక్కా భవనాల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు చాలా సంవత్సరాల నుంచి ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్నాయని, సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని అధికారులు స్థలాన్ని త్వరగా సేకరించాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సేవ చేయాలని, అలా కాకుండా వేరే రకంగా వారిని ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆ విధంగా జరిగితే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. మోటుపల్లి, జాళ్ళపాలెంలో సచివాలయం నిర్మించుటకు సర్పంచులు, రెవెన్యూ అధికారులు స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే అన్నారు. కనిగిరి నుంచి వెలిగండ్ల వరకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని సీఎస్‌పురం బస్సులు వెలిగండ్ల మీదుగా కనిగిరి మళ్ళించాలని వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు వై.భారతి, తాతపూడి సుగుణ, ఎంపీడీవో గంగాధర్, తహశీల్దార్ వాసు, ఏవో శిల్ప, పశువైద్యాధికారి, ఆర్డబ్ల్యూఎస్ పవన్, పంచాయతీరాజ్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మొగుళ్లపల్లి సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మొగుళ్లపల్లి సర్పంచ్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం నుంచి మొగుళ్లపల్లి ప్రధాన రహదారి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి ఉదయం ఇంటి దగ్గర నుంచి పని నిమిత్తం వీరభద్రాపురం వెళ్ళాడు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా మొగుళ్లపల్లి రోడ్డు పక్కన అనుమానాస్పదంగా పడి మృతి చెందాడు. అతని పక్కన ద్విచక్ర వాహనం పడి ఉంది. మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలికి సైలెన్సర్ కాలి గాయం ఉంది. మృతుని కుమారుడు కర్నాటి అశోక్ రెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ కె.అజయ్ కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

దోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్వామి బుధవారం మృతి చెందాడు. మంగళవారం చిన్నారుట్ల సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ కనిగిరికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన తెలిసిందే. అతనితోపాటు గాయపడిన స్వామి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిని వైద్యశాలకు తరలిస్తున్న ఎస్ఐ మురళి

రెండేళ్ల చిన్నారితో సహా మహిళ ఆత్మహత్యాయత్నం

సాగర కాలువలో కొట్టుకుపోతున్న తల్లీబిడ్డను కాపాడిన ఎస్ఐ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో రెండేళ్ల బిడ్డతో కలిసి ఓ మహిళ కురిచేడు రోడ్డులోని సాగర్ కాలువలో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అటుగా వెళ్తున్న ఎస్సై మురళి గమనించి స్థానికుల సాయంతో సాగర్ కాలువలో కొట్టుకుపోతున్న తల్లీబిడ్డను రక్షించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బిడ్డ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సకాలంలో స్పందించి ఎస్ఐ మురళి తల్లీబిడ్డను కాపాడారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను పోలీసులు విచారిస్తున్నారు.. ఈ సందర్భంగా ఎస్ఐ మురళిని పలువురు అభినందించారు.

మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుకున్న 437 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం తెలిపారు. మొత్తం 32 కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను దర్శి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో మూతలు తీసి పూర్తిగా పారపోసి ధ్వంసం చేశారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్ రికార్డులను పరిశీలించి స్టేషన్ పరిధిలో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు.

బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ఎలక్ట్రిసిటీ ఉద్యోగల సమావేశంలో సిఐటియు నేత జివి కొండారెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

కార్మికుల ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి అన్నారు. రాబోయే కాలంలో ఎలక్ట్రిసిటీ పర్మినెంట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని కోరారు. రెగ్యులర్ యూనియన్ కార్యదర్శి వైవిఎస్ నరేష్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, కార్మికులకు రావాల్సిన రాయితీలు పొందాలంటే నిరంతరం పోరాడాలని సూచించారు. కాంట్రాక్ట్ యూనియన్ కార్యదర్శి షేక్ ఖాజావలి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన పెయిడ్ హాలిడేస్, 10 ఏళ్ల ఇంక్రిమెంట్స్ కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్ ఎంసిహెచ్ వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్తు ప్రైవేటీకరణపై 20న చలో విజయవాడ జయప్రదం చేయాలని కోరారు. తదనంతరం సిఐటియు డివిజన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటల పని విధానాన్ని అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. దీన్ని కార్మికులు ఐక్యంగా తిప్పి కొట్టాలని అన్నారు. సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. దాసరి సుబ్రహ్మణ్యం, గుత్తికొండ శీను అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్ సిఐటియు కార్యాలయం నందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ కార్యాలయానికి వెళ్లి డిఈ నల్లూరి మస్తానరావుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఇ మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలు పరిష్కరించి కార్మికులకు న్యాయం చేస్తానని తెలిపారు. మిగిలినవి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, సాంబ, అబ్దుల్లా, కోటేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

డిఇ మస్తాన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు ఆంజనేయులు

కామ్రేడ్ కాకి దేవదానం మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపాడు మండలంలోని ప్రాసంగలపాడులో సిపిఎం సభ్యులు కామ్రేడ్ కాకి దేవదానం (85) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం సభ్యులు, నాయకులు బుధవారం నివాళి సమర్పించారు. దేవదానం గత 40ఏళ్ల నుండి సిపిఎంలో కీలకంగా పనిచేశారని, ప్రతి పోరాటంలో ముందు ఉండేవారని వక్తలు కొనియాడారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంతిమయాత్రలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ఆంజనేయులు, డి మాణిక్యరావు, వై రవీంద్రబాబు, సేవ కోటేశ్వరరావు, నందికోలు సుబ్బారావు, కంచర్ల సుబ్బారావు, కంచర్ల హరిబాబు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

తుఫాను కారణంగా ఈపూరు లంక ప్రజలు ఇబ్బందులను తెనాలి రక్షణ సైన్యంకు సర్పంచ్ మేకతోటి శ్రీకాంత్ తెలియజేశారు. వెంటనే స్పందించిన అంతర్జాతీయ రక్షణ సైన్యం విపత్తుల అత్యవసర సేవల పరిధిలో రాష్ట్రీయ నాయకులు దాసరి దానియేల్ రాజు నాయకత్వంలో తెనాలి డివిజన్లో తుఫాను కారణంగా దెబ్బతిన్న గ్రామాలైన ఈపూరు లంక, మున్నంగి, ముసలపాడు, అత్తలూరి వారిపాలెం గ్రామాల్లోని 500 కుటుంబాలకు నిత్యవసర సరుకులైన బియ్యం, కందిపప్పు, ఉప్పు, చింతపండు, నూనె, సబ్బులు పంపిణీ చేశారు. తెనాలి నాయకులు లెఫ్ట్ కాల్నల్ గేరా థామస్ బృందం రాష్ట్రీయ నాయకుల పక్షంగా చెన్నై నుండి వచ్చిన మేనేజర్ ప్రభాత్ కుమార్, కెప్టెన్ మోష్ జీవన్ రాయ్, మేనేజర్ రవి మోషే, మేకతోటి శరత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

మరుగుదొడ్లు వినియోగించాలి

ప్రజాశక్తి - పర్చూరు

వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవం, ప్రపంచ సిఓపిడి దినోత్సవం సందర్భంగా స్థానిక అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన కల్పించారు. ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారని, అందువలన డయేరియా, డీసెంట్రి, కలరా, టైఫాయిడ్, సిస్టజోమియాసిస్ వంటి అనేక రకాల అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. వీలైనంత వరకు బహిరంగ మల, మూత్రం విసర్జన మానేయాలని చెప్పారు. టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దుమ్ము, ధూళితో పెరుగుతున్న వాయు కాలుష్యం, ధూమపానం, ఊపిరితిత్తులకు సంబంధించిన అంటువ్యాధుల కారణం అవుతున్నాయని అన్నారు. ఊపరి తిత్తుల్లోని గాలి గొట్టలు సన్నబడతాయని తెలిపారు. తద్వారా గాలి పీల్చుకోవడంలో ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. వాకింగ్, యోగా, ప్రాణాయామం వంటివి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఎన్ఎం విజయలక్ష్మి, రత్నమాల, ఆశా కార్యకర్తలు రత్నకుమారి, మేరీ, అంగనవాడీ కార్యకర్త బాలశ్యామల పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అద్దంకి

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సుందరయ్య భవనం (సిఐటియు కార్యాలయం) నందు గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం ఎం నరసింహారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సిందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75ఏళ్లు దాటిన విఆర్ఎలుగా పనిచేస్తున్న వారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. అక్రమ డ్యూటీలు వేసి అదనపు సమయం పని చేయిస్తున్నారని అన్నారు. పదోన్నతులు ఇచ్చి చేయించాల్సిన పనులు ఇవ్వకుండానే తహశీల్దారు కార్యాలయంలో విధుల పేరుతోటి అదనపు చాకిరి చేస్తున్నారని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అటెండర్లు, విఆర్ఒలుగా పదోన్నతులు ఇవ్వాలని, వారసత్వ ప్రాతిపదిక నామినిలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విఆర్ఎల మండల నూతన కమిటీని ఏడు మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జడ్రాజుపల్లి నాగేశ్వరరావు, కనపర్తి స్వాములు, కోశాధికారిగా రుద్ర శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ఎం నరసింహారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని చెరువు జమ్ములపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం వివి కృష్ణారావు బుధవారం తెలిపారు. అండర్ 14 బాలురు, బాలికలు ఈనెల 22 నుండి 25 వరకు తిరుపతి జిల్లా చంద్రగిరిలో, అండర్ 17 బాలుర విభాగంలో ఈ నెల 27 నుంచి 29 వరకు కడప జిల్లా పులివెందులలో, అండర్ 17 బాలికల విభాగంలో ఈ నెల 27 నుండి 29 వరకు నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో, అండర్ 19 బాలుర విభాగంలో ఈ నెల 22 నుంచి 24 వరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం వివి కృష్ణారావు, పిఇటి బోయిన వీరచంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు అభినందించారు.

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సూర్యలంకలో షాపులు తొలగించాలని నోటీసులు

దుకాణాలు తొలగించవద్దని తహశీల్దారుకు దుకాణ నిర్వాహకుల సంఘం వినతి

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంకలో బీచ్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న షాపులను మూడు రోజుల్లో ఖాళీ చేయాలని పంచాయితీ అధికారులు నోటీసులు ఇచ్చారని షాపుల నిర్వాహకులు ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి పొద్దుబోయాక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ షాపులు తొలగించవద్దని కోరారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు వ్యసులు బాటు ఇవ్వాలని కోరుతూ తహశీల్దారు షేక్ సలీమాకు వినతి పత్రం అందజేశారు. బీచ్ అభివృద్ధిలో భాగంగా షాపులు తొలగిస్తున్నామని, షాపులు నిర్వహిస్తున్న వారు అధికారులకు సహకరించాలని నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలో సూర్యలంకలోనే నూతనంగా షాపులు నిర్మించి పంచాయతీ నిబంధనల ప్రకారం అద్దె ప్రాతిపదికన ప్రస్తుతం ఉన్న షాపు నిర్వాహకులకే ఇస్తామని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఉన్న ఫళంగా షాపులు తీసేయమంటే తాము ఎక్కడికి వెళ్లాలని షాపు నిర్వాహకులు వాపోతున్నారు. షాపులు నిర్మించే వరకు తాత్కాలికంగానైనా వ్యాపారాలు చేసుకునే విధంగా అవకాశాలు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సూర్యలంక దుకాణాల యూనియన్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బ్రహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న షాపు నిర్వాహకులు

సహకార బ్యాంకు పథకాలు వివరిస్తున్న దృశ్యం

ధనవృద్ధి డిపాజిట్ పథకంపై ప్రచారం

ప్రజాశక్తి - పంగులూరు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇంకొల్లు బ్రాంచ్, చందలూరు సొసైటీ ఆధ్వర్యంలో సహకార బ్యాంకు అందించే ధన వృద్ధి డిపాజిట్ పథకంపై మండలంలోని చందలూరులో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఎడవల్లి చిరంజీవి కళా బృందం ధనవృద్ధి డిపాజిట్ పథకం, బంగారం పథకంపై రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు తదితర అంశాలపై రైతులకు అర్థమయ్యే రీతిలో కళారూపాల ద్వారా ప్రచారం నిర్వహించారు. చందలూరు చుట్టుపక్కల గ్రామాల్లో ఈ కళా జాతాలు నిర్వహిస్తున్నట్లు సహకార కేంద్ర బ్యాంకు ఇంకొల్లు బ్రాంచ్ మేనేజర్ వి విజయ కుమారి తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్‌కె సుభాని, కొనికి సొసైటీ సీఈఓ శ్రీనుస్వామి పాల్గొన్నారు.

విన్నకోట సురేష్‌ను అభినందిస్తున్న నాయకులు

పి4 కమిటీ సభ్యునిగా 'విన్నకోట'

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 ఫోర్ విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు చేపట్టిన పథకానికి నియోజకవర్గ పి4 కమిటీ సభ్యులుగా జనసేన నాయకులు విన్నకోట సురేష్ నియమితులయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ వద్ద తెలుగుదేశం, జనసేన నాయకులు విన్నకోట సురేష్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఎఎంసి వైస్ చైర్మన్ ఏపూరి భూపతిరావు, అంకిరెడ్డి సుకుమార్, శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర పాల్గొన్నారు.

21న భట్టిప్రోలులో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - బట్టిప్రోలు

ఈనెల 21న భట్టిప్రోలు మార్కెట్ యార్డ్ ఆవరణలో 'మీ కోసం ప్రజా దర్బార్' జరుగుతుందని ఎంపిడిఓ ఎస్ వెంకట రమణ తెలిపారు. స్థానిక శాసన సభ్యులు నక్క ఆనంద్ బాబు హాజరవుతారని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవచ్చని, తక్షణ పరిష్కారం పొందగలిగిన సమస్యలు పరిష్కరిస్తారని, ఇతర సమస్యలు విచారించి పరిష్కరిస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రాజశేఖర్ రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

నీటి సంరక్షణలో అత్యుత్తమ కృషి చేసి దక్షిణాదిలో తొలి స్థానంలో నిలబడి విశిష్ట సేవలందించిన పొదిలి రాజశేఖర్ రాజు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో జాతీయ జల అవార్డు అందుకోవటం రాష్ట్రానికే గర్వ కారణమని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రశంసించారు. బుధవారం ఎఫర్ట్ సంస్థ చైర్మన్ జాష్టి వెంకట మోహన్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పొదిలి రాజశేఖర్ రాజుకి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 20 సంవత్సరాలుగా ఎఫర్ట్ సంస్థ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరతను తగ్గించి వ్యవసాయాన్ని నిలబెట్టే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు కోసం కృషి చేసిన రాజశేఖర్ రాజు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, ఈశ్వర్ ప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు

శ్రీహరితో కేక్ కట్‌చేయిస్తున్న మండవ మురళీకృష్ణ, బౌద్ధ హీన్

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు సంతపేట శివం శరణాలయంలో బౌద్ధ భిక్షువు బౌద్ధ హీన్ పేదలకు అన్నదానం, ఆర్థిక సాయం చేశారు. బుధవారం శివం శరణాలయానికి వచ్చిన శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువులు బౌద్ధ హీన్‌కు శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీదేవి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి జన్మదినం సందర్భంగా బౌద్ధీ హీన్, పారిశ్రామికవేత్త మండవ మురళీకష్ణ ఆధ్వర్యంలో శ్రీహరి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండవ మురళీకష్ణ మాట్లాడుతూ శ్రీహరి ఆకలి కడుపులు ఆమడ దూరంలో ఉన్నా.. పసిగట్టి అన్నం పెట్టి ఆదరిస్తున్నాడని, ఆయన చేసే సేవా కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందన్నారు. ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ గొల్లపూడి శ్రీహరి పుట్టినరోజు సందర్భంగా నిస్సహాయులైన ఐదు పేద కుటుంబాలకు రూ.40వేల రూపాయలు ఆర్థిక సాయంతో పాటు బియ్యం అందించామన్నారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ శ్రీహరి, ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మిశెట్టి రమాదేవి, మానవతా సేవా సంస్థ నిర్వాహకులు కోసూరి శ్రీదేవి, చౌదరి, రాజ్యలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొప్పరాజు, మధుసూదన్

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపిజెఎసి అమరావతి స్టేట్ ఛైర్మన్, ఎపిఆర్ఎస్ఎ స్టేట్ ప్రెసిడెంట్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ రాజాబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పిన్నిక మధుసూదనరావు, కలెక్టరేట్ అధ్యక్షులు సత్యసాయి శ్రీనివాస్, జిల్లా ఇసి మెంబర్ ప్రశాంత్, ఒంగోలు డివిజన్ జాయింట్ సెక్రటరీ రమణయ్య ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్ రోగి చికిత్సలో

గోల్డెన్ అవర్ కీలకం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్‌కుమార్

సెమినార్‌ను ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన రోగికి చికిత్స అందించటంలో గోల్డెన్ అవర్ కీలకమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వనరులు, ఎక్విప్‌మెంట్ అందుబాటు లో ఉంచుకోవాలన్నారు. సంబంధిత విభాగాల వైద్యులు సమన్వయంతో పని చేసి రోగిని సాధారణ స్థితికి తీసుకురావాలని, వారు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. బుధవారం జిజిహెచ్ ఆడిటోరియంలో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో బ్రెయిన్‌స్ట్రోక్ అవగాహనపై సెమినార్‌ను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, అందుకు కారణాలపై ప్రజలలో విస్తత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో చేరిన వారికి అన్ని రకాల వనరులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, గంట లోపు అన్ని రకాల పరీక్షలు పూర్తి అయ్యి చికిత్స ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను కోరారు. న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.హరి దేశంలో బ్రెయిన్ స్ట్రోక్ పెరుగుతున్న స్థితిగతులు, ప్రమాద కారకాలు, స్ట్రోక్ భారంపై వివరించారు. స్ట్రోక్‌ను ముందుగానే గుర్తించడం, జీవన శైలి మార్పులు, ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా మరణాలను తగ్గించవచ్చని సూచించారు.

యాక్యూట్ బ్రెయిన్ స్ట్రోక్ మెడికల్ మేనేజ్‌మెంట్ పై డాక్టర్ నటరాజ పోలి బ్రెయిన్ స్ట్రోక్ అత్యవసర చికిత్సలపై ప్రామాణిక వైద్య విధానాలు వివరించారు. న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బ్రెయిన్ స్ట్రోక్‌లో శస్త్రచికిత్స పద్దతులు, న్యూరోసర్జరీ, శస్త్రచికిత్స అవసరమయ్యే పరిస్థితులను వివరించారు. అత్యవసర సమయాల్లో విభాగాల మధ్య సమన్వయం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ తిరుపతిరెడ్డి, రేడియాలజీ ప్రొఫెసర్ నరసింహాచారి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పద్మలత, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి వివాదం..

లోపాలు కప్పిపుచ్చుకునేందుకే..

వైసిపి నేతల ఆరోపణ

మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అమలు చేయలేక తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు కల్తీనెయ్యి వివాదాన్ని తెరపైకి తెచ్చిందని వైసిపి నేతలు విమర్శించారు. బుధవారం నాడు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒంగోలు నియోజకవర్గ సమన్వయ కర్త చుండూరు రవిబాబు మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు కఠారి శంకర్‌తో కలసి ఆయన మాట్లాడారు. కల్తీ నెయ్యి అంశంపై టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి కూటమి ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని వారు తప్పుపట్టారు. టిటిడిలో ఆర్గానిక్ భోజనసౌకర్యం, పర్యావరణం కాపాడేందుకు ప్లాస్టిక్ నిషేధం, విద్యుత్ బస్సు సౌకర్యం, పిల్లల ఆసుపత్రి ద్వారా చిన్నారులకు గుండె శస్త్ర చికిత్స, టాటా సంస్థల సహకారంతో కేన్సర్ ఆసుపత్రి వంటి పలు అభివద్ధిపనులు చేపట్టిన వ్యక్తిపై కల్తీ నెయ్యి వివాదంతో అప్రతిష్టపాలు చేయాలని చూస్తే ప్రజలు ఒప్పుకోరని హితవు పలికారు. నెయ్యి తనిఖీ చేయడానికి కల్తీ నిరోధక శాఖతో పాటు,విజిలెన్స్, మానిటరింగ్ వంటి పెద్ద వ్యవస్థ ఉందన్నారు. ఈ కారణంగానే 18 ట్యాంకర్లు తిప్పి పంపిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్య నిర్వాహక వర్గ పర్యవేక్షణలో నిర్వహించే అంశాన్ని వ్యక్తిగతమైన రాజకీయ కక్షతో సుబ్బారెడ్డిని ఇరికించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి కఠారి శంకర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, తాతా నర్సింహం గౌడ్, కూనం గౌతమ్, మధు, దేవా, పిగిలి శ్రీనివాసరావు, తాతా నాంచార్లు, వెంకు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసం విస్తృత సేవ..

సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంస్థలు స్వయం సమద్ధిని పెంపొందించడంలో, రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుంటూరు పొగాకు ఉత్పత్తిదారుల సహకార మార్కెటింగ్ సంఘం అధ్యక్షురాలు తాటిపర్తి ఉదయలక్ష్మి అన్నారు. బుధవారం నాడు 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు గుంటూరు జిల్లా పొగాకు ఉత్పత్తిదారుల మరియు క్యూరర్ల సహకార మార్కెటింగ్ సంఘంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ సాధనలో సహకార సంస్థలు వాహకాలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే ప్రతి కార్యక్రమాన్ని సంఘం దృఢ సంకల్పంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. సంఘం మేనేజర్ మంత్రిశ్రీ కష్ణమూర్తి మాట్లాడుతూ సహకారే సమద్ధి అనే లక్ష్యాన్ని సాధించేందుకు సంఘం నిరంతరం కషి చేస్తోందని తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు, పారదర్శక విధానాలు, మంచి ధరల కల్పన వంటి అంశాల్లో సంఘం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమానికి సహకారశాఖ అధికారులు, సంఘ సిబ్బంది గాదె శివపార్వతి, మహేశ్వర్ రెడ్డి తదితరులు, పెద్ద సంఖ్యలో రైతు సోదరులు హాజరయ్యారు.

నవోదయ ప్రవేశపరీక్ష హాల్‌టికెట్ల విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జవహార్ నవోదయ విద్యాలయం 2026-27 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయని జవహార్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం బుధవారం వెల్లడించారు. వచ్చే డిసెంబర్ 13న జరిగే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసిన నేపథ్యంలో, హాల్ టికెట్లను ముందుగా డౌన్‌లోడ్ చేసి వివరాలు సరిచూసుకోవాలని తెలిపారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ లేదా ఇతర సాంకేతిక సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యాలయ ఆఫీస్‌ను నేరుగా సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహిళా సేవామూర్తులకు సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

58వ గ్రంథాలయ వారోత్సవాలు, జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం ఎన్నారై గ్లోబల్ ఫోరం, ఎపి మహిళాభ్యుదయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ, సాంస్కృతిక రంగాలలో విశేష సేవలందిస్తున్న ఇద్దరు మహిళా మూర్తులను ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ ఉక్కుమహిళగా పేరుపొందిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశ మహిళందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం విశిష్ట సేవామూర్తులు మారేపల్లి సూర్యకూమారి, లలితా శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సుజాత,మాజీ ఎంపిపి నాళం నరసమ్మ, న ర సం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, డాక్టర్ సుధాకర్, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

రోడ్డు ప్రమాదంలో మరణించిన టిడిపి కార్యకర్త కుటుంబానికి 5 లక్షల ప్రమాద బీమా చెక్కును బుధవారం అందజేశారు. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన మొలకపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన. భార్య నారాయణమ్మకు టిడిపి ప్రమాద బీమాలో రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జి కామేపల్లి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు రామాంజినేయులు, యూనిట్ కన్వీనర్ రాయపాటి బాబురావు పాల్గొన్నారు.

25న మున్సిపల్ షాపుల వేలం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులో శ్రీ దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ లోని షాపులకు ఈ నెల 25న ఉదయం11 గంటలకు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలకు 16-10-2025న విడుదల చేసిన వేలం నోటీసును చూడాలని తెలిపారు.

సఫాయి కర్మచారి యువతకు రుణావకాశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలోని సఫాయి కర్మచారి వత్తికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె అర్జున్ నాయక్ బుధవారం నాడు తెలిపారు. పూర్తి వివరాలకు 9963288656 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

డీఎస్సీ ఉద్యోగులకు సెలవులివ్వాలి..

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

డిఎస్సీ 2025 ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు జిల్లా అధ్యక్షులు బి. వెంకటరావు, గౌరవాధ్యక్షులు ఎ. అమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్. లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి. కీర్తి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సర్వే చేస్తున్న ఎఇ అనంతవరపు ఎర్రకోటయ్య

కుందుర్రులో గృహ లబ్ధిదారుల సర్వే

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఈ నెల 12 నుండి 30 వరకు హౌసింగ్ సర్వే నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ అనంత వరపు ఎర్రకోటయ్య తెలిపారు. మండలంలోని కుందుర్రు లో బుధవారం ఆయన సర్వే నిర్వహించారు. ఇల్లు లేని నిజమైన లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. మండలం లో 12 వందల గృహాలు టార్గెట్ కాగా ఇప్పటికే 350 గృహాలకు రబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. లబ్ధిదారు లు మహిళలై ఉండి తెల్ల రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు పుస్తకం, ఉపాధి హామీలో జాబ్ కార్డు కలిగి ఉండి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. లబ్ధిదారుని ఇంటి పునాధి నిర్మాణానికి రూ.60 వేలు, శ్లాబ్ లెవెల్‌కు రూ.60 వేలు, శ్లాబుకు రూ.70 వేలు, ఇల్లు పూర్తయిన తర్వాత రూ.60 వేలు చొప్పున రూ.2.50 లక్షలు లబ్ధిదారునికి అందజేస్తామని అన్నారు. ఈనెల 30 తర్వాత వచ్చే దరఖా స్తులను పరిశీలనలోకి తీసుకోమని అన్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

కంపోస్ట్ షెడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

వర్మీకంపోస్టు తయారుచేయాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మండలంలో తడి చెత్త, పొడి చెత్త కేంద్రాల్లో తప్పనిసరి గా వర్మీ కంపోస్టు తయారీ చేపట్టాల్సి ఉందని ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ తెలిపారు. భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన షెడ్డులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల్లో షెడ్లను నిర్మించాల్సి ఉండగా వాటిలో రెండు గ్రామాల్లో స్థలాభావ కారణంగా నిర్మాణాలు జరగలేదని అన్నారు. మిగిలిన గ్రామాల్లో నిర్మించిన 9 షెడ్లలో 5షెడ్లులో ఈపాటికే వర్మీ కంపోస్టులు తయారీ జరుగుతుందని అన్నారు. మిగిలిన షెడ్లలో కూడా వర్మీ కంపోస్టు తయారు చేసే విధంగా ఆయా పంచాయతీలు చర్యలు చేపట్టాల్సి ఉందని చెప్పారు. తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి తడి చెత్త ద్వారా వర్మీ కంపోస్టులు తయారు చేయడం వలన పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. దీనిలో భాగంగా ప్రతిరోజు ఆయా గ్రామాల్లోని షెడ్లను పరిశీలించటం, గ్రీన్ అంబాసిడర్ల పనితీరు వంటి అంశాలు విచారిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఒపిఆర్డి విజయబాబు, కార్యదర్శులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

పరీక్షలు చేస్తున్న దృశ్యం

టీవీ, సెల్ ఫోన్ వంటి వాటిని తీక్షణంగా చూడటం ద్వారా కంటి సంబందిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని ఐవిఎస్ మాధ వన్ అన్నారు. మండలం లోని వేలమూరిపాడు ఎస్సి కాలనీలో ఒంగోలుకు చెందిన స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 30మందికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మిగిలిన వారికి తగు సూచనలతోపాటు మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ పిఆర్ఓ టి గోపీచంద్, టెక్నీషియన్ సోమయ్య తోబాటు గ్రామానికి చెందిన జి అంజయ్య, డేవిడ్, కె రవీంద్రబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, రాణి సహకరించారు.

రైతులకు వరం 'అన్నదాత సుఖీభవ'

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' పథకాలు వరంగా మారాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గత ప్రభుత్వం పేరుకు భరోసాలు ప్రచారం చేసుకుంటే తమ ప్రభుత్వం నేరుగా రైతు చేతికి సాయం అందిస్తుందిన అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం అవగాహన స్టాల్స్‌ను పరిశీలించారు. సబ్సిడీపై రైతుకు మినీ ట్రాక్టర్ అందజేశారు. స్వయంగా ట్రాక్టర్ నడిపారు. జొన్నతాలికి చెందిన రైతు జంద్రాజుపల్లి ఏసునాదంకి రూ.5,24,879 విలువైన మినీ ట్రాక్టర్ రూ.2.45లక్షల సబ్సిడీతో అందించినట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఉందని, రైతులు అధైర్య పడకుండా సాగు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో 37,861 మంది రైతులకు రూ.25.83 కోట్లు ఈ పథకం ద్వారా లబ్ధి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ప్రత్యేక అధికారి లవన్న, మార్క్ ఫెడ్ డిఎం కరుణ శ్రీ, ఎడిఎలు సుదర్శనరావు, ప్రవీణ, తహశీల్దారు ప్రశాంతి, ఎంపిడిఒ శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ హనుమంతు నాయక్, టిడిపి మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, రంగయ్య చౌదరి, నాయుడు హనుమంతరావు, పిఎసిఎస్ ఛైర్మన్ దాసరి హనుమంతరావు, ఆదినారాయణ, రజాక్, జనార్ధన్, ఫారుక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలో 7974 మంది రైతులకు రూ.2.86 కోట్లు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సమ్మాన్ యోజన క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఎఒ కుమారి చెప్పారు. ఈ సందర్భంగా తహశీల్దారు కె రవి కుమార్ మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో అన్న దాత సుఖీభవ నిధులు వేసి ఆదుకున్నట్లు చెప్పారు. తుఫానుకు రైతులు పంట నష్టం జరిగి మరల సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో ఈ నగదు ఎంతో ఉప కరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జావేద్, పంచాయతీ కార్యదర్శులు రాణి, దొప్పలపూడి మోహన్ బాబు, బాబురావు, నాగేష్, జ్యోతి, శ్రీను, రైతులు మోహన రావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, గుత్తా వాసు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని గుంటుపల్లి రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం లబ్దిదారుల జాబితా విడుదల చేశారు. మండలంలోని 9150 మంది రైతులకు రూ.4.58 కోట్లు, పిఎం కిసాన్ యోజన ద్వారా 8367 మంది రైతులకు రూ.1.67 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు క్లస్టర్ ఇంచార్జ్ మళ్లీనీడి గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు రవి నాయక్, విఆర్ఒ అశోక్ పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 2వ విడత నిధుల విడుదల సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన, మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసా యం అలవర్చుకోవాలని అన్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, ఆరోగ్య వంతమైన అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. నియోజకవర్గంలో 28634 మంది రైతులకు రూ.18.81 కోట్ల నిధులు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డిఒ ఎన్ రామలక్ష్మీ, రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మీ, కృష్ణ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతగాని మురళీధర రావు, రేపల్లె ఎఎంసి ఛైర్మన్ ఎం అనురాధ, భాస్కర రావు, జెడ్‌పిటిసి ఎం వెంకట పావని, తహశీల్దారు పద్మావతి, ఎఒ ఎండి ఫారుక్ హుస్సేన్ పాల్గొన్నారు.

రేపల్లె : మండలంలోని పేటేరులో అన్నదాత, ప్రధానమంత్రి కిసాన్ పథకం 2వ విడత నిధుల విడుదల చేశారు. ఎఒ మహేష్ అధ్యక్షతన జరిగిన సభలో తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఎంపిడిఒ రవిబాబు మాట్లాడుతూ మండలంలో 7,852 రైతులకు రూ.5.18 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి కనపర్తి వసుమతి, ఎంపిటిసి ప్రభాకర్, ఆరేపల్లి వీరబాబు పాల్గొన్నారు.

వేమూరులో చెక్కు అందజేస్తున్న ఆనందబాబు

వేమూరు : రైతు సంక్షేమాన్ని విజన్‌గా తీసుకుని 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' పథకం కింద 2వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. చుండూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 27,965 మంది రైతులకు రు.18.54 కోట్లు జమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేయనుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆర్‌డిఒ టి చంద్రశేఖర్ నాయుడు అన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 2వ విడత నిధుల విడుదల సందర్భంగా మండలంలోని బోయినవారిపాలెంలో బుధవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవ ర్గంలో 7,368 మంది రైతు కుటుంబాలకు రూ.4.60 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ కె జనార్ధనరావు, ఆప్కో ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, ఎడిఎ టి రత్నకుమారి, పశుసంవర్ధక శాఖ ఎడి ఎస్ చిట్టిబాబు, తహశీల్దారు కె గోపికృష్ణ, ఎఒ పి నిర్మలాదేవి, ఎం సరిత, పిఎసిఎస్ ఛైర్మన్ కోటి మోహన్‌కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి గుద్ధంటి చంద్రమౌళి, చప్పిడి పోలయ్య, మాజీ ఎంపిటిసి బోయిన కేశవులు, కె వెంకట్రావు, ఎర్రాకుల ప్రసాద్, గూడూరు శివరామప్రసాద్, కొమ్మనబోయిన రజిని పాల్గొన్నారు.

సంతమాగులూరు : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని ఆర్ఎస్‌కెల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు వినిపించినట్లు ఎఒ షేక్ సైద తెలిపారు. మండలంలో 8871 మంది రైతులకు రూ.5.81 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ తేలప్రోలు రమేష్, ఎంపిడిఒ జ్యోతిర్మయి, తహశీల్దారు కె రవిబాబు, పంచాయతీరాజ్ డిఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

27న జాతీయ వెబినార్

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు సెయింట్ ఆన్స్ మహిళ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ లైవ్ సైన్సెస్ అండ్ కంప్యూటర్స్ సైన్స్ ద్వారా మేధా అనే శీర్షికతో ఈ నెల 27న ఆన్లైన్ ద్వారా నేషనల్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేల్పుల మోహనరావు తెలిపారు. ఈ వెబ్బినార్‌లో ప్రముఖులు ప్రసంగిస్తారని అన్నారు. కృత్రిమ మేధస్సు, జీవ శాస్త్రంలో దాని ప్రయోజనాల గురించి విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీ నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలకు జాతీయ స్థాయిలో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

ఐవిఎఫ్ ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్

ప్రజాశక్తి - పర్చూరు

పత్రం అందుకుంటున్న దృశ్యం

ఎపి స్టేట్ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్ చేతుల మీదుగా ఇంటర్నే షనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) రాష్ట్ర ఉపాధ్య క్షునిగా పర్చూరు చెందిన మామిడిపాక హరి ప్రసాద్ నియామక పత్రా న్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ రాష్ట్ర వైశ్య సమాజ అభ్యున్నతికి ఫెడరేషన్ చేపట్టబోయే కార్యక్రమాలకు హరి ప్రసాద్ వంటి నాయకుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. కొత్తగా ఉపాధ్య క్షునిగా నియమితులైన ప్రసాద్ రాష్ట్ర వ్యాప్తంగా వైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఐవిఎఫ్ సెక్రటరీ మోహనరావు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సుధీర్, ఎంవి రమణారావు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - అద్దంకి

వరి పంట గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. గోపాలపురం, అద్దంకి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎలు శివాని, యర్రా రాఘవయ్య, యర్రా నరసింహారావు పాల్గొన్నారు. కలవకూరు, ధర్మవరం రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల లారీల వద్ద ఉన్న రైతులు

దుకాణాలకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ ఏడాది వ్యవసాయ పనులు ఖరీఫ్ సీజన్ ఆరంభమైన నుంచి రబీ సీజన్ వరకు యూరియా కొరత ఏర్పడింది. ఆ సమయంలో ప్రభుత్వం అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం, ప్రవేట్ వ్యాపారులు, సహకార సంఘాల వద్ద ఎరువుల నిల్వాలు పరిశీలించారు. అయితే అది పూర్తిస్థాయిలో జరగకపోవడంతో రైతులు యూరియ, డిఎపి వంటి ఎరువుల కోసం ఇబ్బందులు పడ్డారు. గతంలో పడ్డ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకున్న రైతులు మండలానికి ఎరువుల లారీలు రావడంతో దుకాణాల వద్దకు వచ్చారు. ఎరువుల దుకాణాల వద్ద క్యూ కట్టారు.

పైపులైన్ పనులు పరిశీలిస్తున్న సర్పంచి రాము

పైపులైను మరమ్మతులు

ప్రజాశక్తి - అమృతలూరు

అమృతలూరు గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్, తెనాలి, చెరుకుపల్లి ఆర్ అండ్ బి ప్రధాన రోడ్డుపై మంచినీటి మెయిన్ పైపులైన్ పగిలిపోయింది. ఈ పైపులైన్ మరమ్మత్తు పనులను సర్పంచ్ దేవరకొండ రాము బుధవారం పరిశీలించారు. ఈనెల 13న జరిగిన ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన 18, 19 తేదీల్లో మరమ్మతులు చేపట్టి కొత్త పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను, మొంథా తుఫాన్ ప్రభావంతో బాడవ డొంక నందు చెట్టు పడిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో చెట్లను తొలగిస్తున్న ట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జె వినయ్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రదీప్, గ్రేడ్ 5 సెక్రటరీ జ్యోతి, బిల్ కలెక్టర్ రిజ్వాన్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు ఎస్ఐ రత్నకుమారి చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు చట్టంలో తమకున్న రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకో వాలని చెప్పారు. చట్టానికి లోబడి విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఆడపిల్లలు అనుకోని ప్రమాదం ఎదురైనప్పుడు 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు వాణి, బాల, సరిత, స్టేషన్ సిబ్బంది కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విచారిస్తున్న రేపల్లె రూరల్ సిఐ సురేష్ బాబు

కూరగాయల దుకాణంలో పేలుడు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

దీపావళి టపాకాయల మందు పేలడంతో కూరగాయల దుకాణం ధ్వంసమై, సమీపంలోని ఇంటి అద్దాలు పగిలిన సంఘటన మండల కేంద్రమైన చెరుకుపల్లిలో బుధవారం సంభవించింది. స్థానిక ఖాదర్ ఖాన్ సెంటర్ సమీపంలోని హెచ్‌డిఎఫ్ బ్యాంకు వద్ద కేసన గోపికృష్ణ కూరగాయల దుకాణంలో టపాకాయల మందు నిల్వ ఉంచగా అది ఒత్తిడికి గురై పేలుడు సంభవించింది. దీంతో రేకులు పగిలి దుకాణం ధ్వంసమైంది. పేలుడు ధాటికి సమీపంలోని ఇంటి అద్దాలు పగిలాయి. సంఘటన స్థలాన్ని రేపల్లె రూరల్ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్ కుమార్ పరిశీలించి దుకాణా దారున్ని విచారించారు. ఈ మేరకు ఇంటి అద్దాలు ధ్వంసమైన ఇంటి యజమాని కొమ్మూరి ఆనంద్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

చర్చిలో అన్నదానం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంలోని లూథరన్ చర్చి 8వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. స్థానిక సంఘ పాస్టర్ శాంత కుమార్ అధ్యక్షత వహించారు. పర్చూరు మండలం పోతుగుట్ల లూథరన్ చర్చి పాస్టర్ ప్రేమానందం క్రీస్తు శాంతి బోధనలు వివరించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు వందనం, దమ్ము రాజు, ఆశీర్వాదం, రాజ శేఖర్, మద్దిరాల రాజారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తాం

పంచాయతీరాజ్ ఎఇ గద్దం హనుమంతరావు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఏఈ గద్దం హనుమంతరావు తెలిపారు. ఆయన 'ప్రజాశక్తి'తో బుధవారం మాట్లాడారు. మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.35 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిర్మాణం 80శాతం పూర్తయిందని తెలిపారు. కొండమూరులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు, కొండ మంజులూరులో కమ్యూనిటీ హాలుకు రూ.20 లక్షలు, బూదవాడలో కమ్యూనిటీ హాలుకు రూ.30 లక్షలు, పంగులూరు బీసీ కాలనీ కమిటీ హాలుకు రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీటి నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అలవల పాడులో ముస్లిం కమ్యూనిటీ హాలుకు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. పంగులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు, అదనపు గది నిర్మాణానికి రూ.10 లక్షలు, బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

దేవాలయంలో గంటలు, హుండీ చోరీ

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని కొత్తపాలెం గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుడి గంటలు, హుండీని దొంగలు అపహరించారు. ఆ పక్కనే ఉన్న అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండిని సైతం ఎత్తుకెళ్ళారు. సమీపంలోని రహదారి పక్కనే దీన్ని పడవేశారు. ఆలయ పూజారి మంగళవారం రాత్రి యథావిధిగా తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చిల్లర దొంగల ఆట కట్టించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటా

సీసీ టీవీని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

మని ఎస్ఐ నాగరాజు అన్నారు. పనిచేయని కర్మాగారాల్లో కేబుల్ వైర్లు, గుడుల్లో గంటలు, కోడిపుంజుల దొంగతనాలు చిల్లర దొంగల పనేనని, వీరిని గుర్తించి దొంగతనాలు అరికడతామని అన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కొల్లూరు పరిపాలన అధికారి ఎస్ మహాలక్ష్మి హాజరై ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు కొనియాడారు. అనేక రంగాల్లో దేశాన్ని ముందు కు తీసుకుని వెళ్లారని అన్నారు. భారతదేశ ప్రథమ మహిళా ప్రధాని ఇందిరా గాంధీ అని తెలిపారు. బాలిక లకు మహిళా సాధికార వ్యవస్థ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు గురు

విద్యార్థినులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వారం ముగింపు రోజున బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. గ్రంథాలయ అధికారి వై రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిడిఒ కార్యాలయ సహాయకులు సిహెచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన రోడ్డు చూపిస్తున్న జిలాని

కొత్తపేట రోడ్డు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చీరాల

చీరాల నుంచి కొత్తపేట వెళ్లే ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో చేపడుతున్న మరమ్మత్తు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలగా చేపడుతున్న పనులు నత్త నడకన సాగుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. చీరాల నుంచి ఒంగోలుకు వెళ్లే ప్రధాన రహదారి గావడంతో పాటు ప్రభుత్వ వైద్యశాల, ఇతర ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో అత్యవసర సమయంలో రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అల్తాఫ్, శ్రీను, నాగూర్, రహమతుల్లా, అలీ పాల్గొన్నారు.

పెన్షన్ ఇచ్చి ఆదుకోండి..

ప్రజాశక్తి - పంగులూరు

వైకల్యం చూపుతున్న ఏడుకొండలు

పక్షవాతంతో వికలాంగుడినై బ్రతకటానికి ఇబ్బంది గా ఉందని, తనకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని పంగు లూరుకు చెందిన గూండా ఏడుకొండలు అధికారులను వేడుకుంటున్నారు. రోజు వారీ కష్టం చేసుకుంటూ రిక్షా తొక్కి జీవిస్తున్న తనకు 2023 డిసెంబర్ 9న పక్షవాతం వచ్చిందని, అప్పటి నుండి కాలు, చెయ్యి, నోరు, సచ్చుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బుతో పాటు అప్పులు తెచ్చి వైద్యం చేయించుకున్న పూర్తి స్థాయిలో నయం కాలేదని తెలిపారు. ఇప్పటికీ కాలు చెయ్యి పూర్తిగా నయం కాలేదు. ఏ పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. కుటుంబం గడవని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సదరం సర్టిఫికెట్ తీసుకున్నానని, 82శాతం వైకల్యం ఉన్నట్లు డాక్టర్లు సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. అయితే పెన్షన్లు పెట్టుకునే సైట్ రాలేదనే కారణంతో తనకు పెన్షన్ ఇంతవరకు రాలేదని, అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని తెలిపాడు. 64ఏళ్ల తనకు పెన్షన్ లేదని, వికలాంగుడనైన తనకు పెన్షన్ మంజూరు చేయించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

మంత్రికి మొక్క అందిస్తున్న గ్లోరియా, సలీమా

'మంత్రి కొలుసు'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని నందిరాజుతోట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాత, సుఖీభవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కొలుసు పార్థసారధికి మొక్క అందజేసి ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా ఘన స్వాగతం పలికారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి కోటి సంతకాల ఉద్యమం

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం జయప్రదం చేయాలని వైసిపి ఇన్‌ఛార్జి గాదే మధుసూదన రెడ్డి కార్యకర్తలను కోరారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన సంతకాల పత్రాలు వైసిపి కన్వీనర్, నాయకులకు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీరాల, పర్చూరు పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి, వైసిపి నాయకులు తోకల కృష్ణమోహన్, కటారి అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేపల్లె రూరల్ సిఐ సురేష్ బాబు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని విద్యార్థినీ, విద్యార్థులు వీటి పట్ల అవగాహన కలిగి ఉండాలని రేపల్లె రూరల్ సిఐ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని కావూరు ఏపి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల దుష్ప్రభావాలు వివరించారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వాటి వలన వచ్చే దుష్ప్రభావాలు తెలుసుకోవాలని అన్నారు. వాటిలోని మంచిని మాత్రమే గ్రహించి చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సులభతరంగా పాఠాలు బోధించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంగా పాఠాలు బోధించాలని ఎంఈఓ షేక్ కాలేశావలి అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎల్ మాధవిలత అధ్యక్షతన టీచ్ టూల్ రిఫ్రెషర్స్ ట్రైనింగ్ బుధవారం నిర్వహించారు. 27 మంది ఉపాధ్యాయులు, పరిశీలకులు పాల్గొన్నారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఈఓ షేక్ కాలేశావలి, రిసోర్స్ పర్సన్ షేక్ మస్తాన్ భాష, నూకతోటి అరుణకుమారి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు ప్రాంతాలు, 9 ఎలిమెంట్లు, 26 బిహేవియర్స్, క్లాస్ రూముల్లో ఏ విధంగా పరిశీలన చేయాలో వివరించారు. ఈ రెండు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో అమలు చేసి ఉపాధ్యాయుల నైపుణ్యాలు అభివృద్ధి చేయాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ పెట్టాలని రానున్న పదోతరగతి పరీక్షల్లో ఫలితాల సాధనలో జిల్లాలో అగ్రస్థానంలో మండలాన్ని నిలబెట్టాలని కోరారు.

22న పంచాయతీలలో గ్రామసభలు

డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు ఈనెల 22న నిర్వహించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజలకు అవసరమయ్యే సేవలను గ్రామ స్థాయిలోనే అందించడం గ్రామ సభల ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ సభలలో జాబ్ కార్డు కోసం కొత్తగా దరఖాస్తులు వస్తే స్వీకరించి, మంజూరు చేయాలన్నారు. ఉపాధి శ్రామికుల పని కొరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇటీవల ఈ-కెవైసి సమస్యల తో రద్దు / తొలగించిన జాబ్ కార్డులు మళ్లీ పరిశీలించి, అర్హులైతే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రకాశం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి శ్రామికులు. గ్రామ సభలో పాల్గొని ఉన్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను అధికారులు ముందు ఉంచాలని కోరారు.

21న ఎల్ఎల్ఆర్ స్లాట్ బుకింగ్

డిటిసి ఆర్.సుశీల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఆదేశాల మేరకు వికలాంగులకు ఎల్ఎల్ఆర్ స్లాట్ బుకింగ్ ప్రకాశం భవనంలోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఈనెల 21న జరుగుతుందని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. ఎల్ఎల్ఆర్ స్లాట్ బుకింగ్ చేసుకునే అర్హులైన వికలాంగులు ఒరిజినల్ అడ్రస్ ప్రూఫ్, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్, ఫారం 1ఏ తీసుకొని ఈనెల 21న ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఈనెల 22న కంప్యూటర్‌లో ఎల్ఎల్ఆర్ పరీక్ష వారికి కేటాయించిన సమయం ప్రకారం పిజిఆర్ఎస్ హాలులో నిర్వహిస్తామన్నారు. వికలాంగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిటిసి కోరారు.

శుభ్రతపై అవగాహన వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకొని శుభ్రత-పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. బుధవారం నాడు ఒంగోలు మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాల్‌లో రూపొందించిన శుభ్రత అవగాహన గోడపత్రికలను జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు డివిల్ డిఓటి ఉషారాణి, ఎంపిడిఓ కె రాజశేఖర్ రావు,డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోలు,కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వృద్ధులపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు

సిఐ రాజేష్‌కుమార్

ప్రజాశక్తి-పొదిలి

వృద్ధులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని సిఐ రాజేష్‌కుమార్ హెచ్చరించారు. పొదిలిలో నివాసముంటున్న కొనకనమిట్ల మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన బూదాల మాణిక్యం అలియాస్ మానెమ్మ అనే వద్ధురాలు తన మనవడు కొట్టాడని, తన డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. తన డబ్బులు ఇప్పించాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఎదుట కన్నీటిపర్యంతమైంది. దీంతో స్పందించిన ఎస్‌పి వద్ధురాలికి భద్రత కలిపించి ఆర్థిక వివాదాన్ని పరిష్కరించాలని, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని పొదిలి సిఐకి ఆదేశాలు జారీ చేశారు. వృద్ధురాలి సమస్యపై వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అందులో భాగంగా సిఐ రాజేష్ కుమార్ తమ సిబ్బందితో కలిసి వెంటనే వద్ధురాలి స్వగ్రామానికి వెళ్లారు. ఫిర్యాదురాలిపై ఆమె మనవడు బూదాల మెస్సీ అలియాస్ మెషాక్ దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుసుకుని, అతడిని గట్టిగా మందలించాడు. మళ్లీ ఇలాంటి ప్రవర్తన పునరావతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాణిక్యం వయసు ఎక్కువగా ఉన్నందున సీనియర్ సిటిజన్ రక్షణ కోసం ప్రత్యేక చర్యలతో మనవడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కౌన్సిలింగ్ ఇచ్చారు. మాణిక్యం పేరుతో ఉన్న 4 ఎకరాలు భూమిని తన బ్రతుకుదెరువుకోసం ఆమెకి నచ్చిన వారికి కౌలుకి ఇచ్చుకొనే అధికారం ఉందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని ఆమె కుమారుడు, బుదాల శాంసన్, మనవడు బూదాల మెస్సీని సిఐ సూచించారు. మాణిక్యం సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని, ఆమె స్వగ్రామమైన నాగంపల్లిలో ప్రభుత్వ గహ నిర్మాణ పథకాల కింద ఇల్లు కల్పించే విషయంపై కొనకనమిట్ల తహశీల్దారుతో సిఐ మాట్లాడారు. వద్ధురాలు నివసించేందుకు త్వరలో ఓ ఇంటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎస్‌పికి ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే ఆయన మార్గదర్శకత్వంలో వద్ధురాలి కుటుంబ కలహాలు, ఆర్థిక వివాదం పరిష్కారమయ్యాయి. వద్ధురాలి సమస్యను మానవతా దక్పథంతో తక్షణమే పరిష్కరించిన ఎస్‌పికి, సిఐకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న సిఐ రాజేష్‌కుమార్

అభివృద్ధి కార్యక్రమాలను

వేగంగా పూర్తి చేయాలి..: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. అభివృద్ధిలో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ చెప్పారు. అలసత్వం ప్రదర్శించరాదన్నారు. వాడరేవు-చిలకలూరిపేట 167 ఏ జాతీయ రహదారి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. చీరాల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయితే రహదారి నిర్మాణం ముగుస్తుందని గుత్తేదారులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఇందుకొరకు సికింద్రాబాద్ లోని రైల్వే చీఫ్ ఇంజినీర్‌తో ఫోన్లో మాట్లాడారు. బ్రిడ్జి త్వరగా నిర్మించాలన్నారు. గుంటూరు-నిజాంపట్నం జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలన్నారు. నిడుబ్రోలు నుంచి చందోలు వరకు రూ.8 కోట్లతో 4.6 కిలోమీటర్లు నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రహదారి త్వరగా పూర్తి చేయాలన్నారు. రేపల్లె-నిజాంపట్నం, చందోలు-నిజాంపట్నం రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు నుంచి బాపట్ల వరకు నాలుగు వరుసల రహదారి నిడుబ్రోలు మీదుగా బైపాస్ ఉండేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వదేశీ దర్శన్ కింద సూర్యలంక బీచ్ అభివద్ధి పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యలంక నగరవనం వద్ద బోట్ ల పార్కింగ్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులను పరిశీలించాల న్నారు. పర్యాటక రంగంగా బాపట్లను అభివృద్ధి చేయడానికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జల వనరుల శాఖ కాల్వను రూ.11 కోట్లతో అభివద్ధి చేయాల్సి ఉందన్నారు. పర్యాటకుల సంఖ్య మరింత పెరగడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిజాంపట్నం ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ అభివద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి కాకపోవడంపై ఆరా తీశారు. పనులు నిలిచిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడి గాలిదేవుడు, ఆర్అండ్‌బి డిఇ అరుణ కుమారి, జలవనరుల శాఖ డీఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

శిక్షణ ద్వారానే యువతకు ఉద్యోగాలు..

డిఆర్‌డిఏ పీడీ నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వ డీడీయూ-జీకేవై పథకం ఉద్దేశ్యమని డిఆర్ డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ అన్నారు.బుధవారం టిటిడీసీ ప్రాంగణంలో టీటీడీసీ, స్కిల్ కాలేజ్, స్పైస్ స్కిల్స్ కాలేజ్, కె.కె. కంప్యూటర్స్ శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ట్రైనీల కోసం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీడీయూ-జీకేవై పథకం రాష్ట్రంలో సీడాప్ ద్వారా అన్ని జిల్లాల్లో అమలవుతోందని, 18-35 ఏళ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్-కంప్యూటర్ అవగాహన, లైఫ్ స్కిల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో వసతి, భోజనం, శిక్షణా మెటీరియల్, యూనిఫాం, కోర్సు సర్టిఫికేట్ అందజేస్తున్నామని వివరించారు.టీటీడీసీ స్కిల్ కాలేజ్ లో 60 మంది శిక్షణ - 49 మందికి ఉద్యోగాలు,స్పైస్ స్కిల్స్ ఇండియాలో 168 మందికి గాను 155 మందికి ఉద్యోగాలు, కె.కె. కంప్యూటర్స్ ద్వారా140 మందికి శిక్షణ, 128 మందికి ఉద్యోగాలు, అమ్మా ఎడ్యుకేషనల్ సొసైటీ (కందుకూరు) టెక్నికల్ ఇంజనీర్ 610 మందికి శిక్షణ, 199 ఉద్యోగాలు, జూనియర్ సాఫ్ట్వేర్ 60 మంది శిక్షణ 58 ఉద్యోగాలు, లావా ఎడ్యుకేషనల్ సొసైటీ (కనిగిరి) 52 మందికి శిక్షణ 46 ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని, క్రమశిక్షణతో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ప్రాజెక్టు డైరెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేడిఎం డి. శ్రీనివాసులు, ట్రైనర్లు కె. శ్రీనివాసరావు, కె.వి. ప్రభాకరరావు, బి. అజయ్‌కుమార్, జాబ్ కోఆర్డినేటర్ ఎస్ కె హిమాం, వార్డెన్ టీవీ ప్రసన్న, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలల్లో అభివద్ధి పనులు శరవేగంగా చేపట్టాలన్నారు. వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ప్రాంతీయ వైద్యశాలలో అభివృద్ధి పనులపై బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెరుగైన వసతులు, సదుపాయాల కోసం రూ.23.75 కోట్లతో చేపట్టిన అభివద్ధి పనులపై ఆయన సమీక్షించారు. స్కానింగ్ సెంటర్లు, క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు పనులలో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు రావడంతో ప్రధానంగా చీరాల, బాపట్ల ప్రాంతీయ వైద్యశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అన్ని సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏపీఎంఐడిసి ఇంజినీరింగ్ అధికారులు ప్రతివారం కలెక్టరేట్ కు నివేదిక పంపాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ ను 2026 మే నెల నాటికి పూర్తి చేయాలన్నారు. ఆర్టిజం సెంటర్, భవిత సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ప్రత్యేక అవసరత ఉన్న చిన్నారుల భవిష్యత్తు కొరకు ఆర్టిజం కేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. చీరాల, ఈపురుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడానికి అధికారిక అనుమతులు వచ్చాయన్నారు. బాపట్ల పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో రూ. 27.5 లక్షలతో ఆర్టిజం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇదే ప్రాంతంలో భవిత కేంద్ర ఏర్పాటుకు అనుకూలమైన భవనం, పరిస్థితులు ఉన్నాయని వివరించారు. అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో వైద్య విధాన్ పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, ఏపీ ఎమ్ఐడిసి, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్